క్లుప్తంగా

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

గార్లదిన్నె: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు వారు మర్తాడులో సీసీ రోడ్డు, కృష్ణాపురం నుంచి కమలాపురం తారు రోడ్డు, శిరివరంలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే వైవీఆర్



శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: శ్రీశైలంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని మంగళవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం చేశారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని నిరసన

తాడిపత్రి టౌన్: నిరుపేద దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు కుళ్ళాయిప్ప, గిత్తరాజు, విజయ్‌కుమార్, సూరి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పుట్లూరు: కడవకల్లు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న పలువురు వలంటీర్లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, స్పందన కార్యక్రమంపై ఆరా తీశారు.

పామిడి: వంకరాజుకాలువ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు, హాజరు పట్టీని పరిశీలించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆయన సిబ్బందితో సమీక్షించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు ఎంఈఓ జయానాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిస్తాం

గుంతకల్లుటౌన్: విజయనగరం జిల్లాలో అకారణంగా లాకౌట్ చేసిన జూట్‌మిల్లును తెరిపించాలని 1994లో కార్మికులు చేపట్టిన పోరాటంలో అమరులైన కార్మికుల ఆశయాలను కొనసాగిస్తామని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సురేష్ తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అమరులైన కార్మికుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీరాములు, చిన్నా, రఘునాథరెడ్డి, దేవేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ప్రభుత్వాసుపత్రి తనిఖీ



ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని మంగళవారం డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులతో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు, విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రోగులకు నాణ్యమైన వైద్యాన్ని సకాలంలో అందించాలని డాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆదిశేషు

పెద్దపప్పూరు: భార్య ఎడబాటు తాళలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు... తబ్జూల గ్రామానికి చెందిన ఆదిశేషు(34) అదే గ్రామానికి చెందిన శివమ్మను కొన్నేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొన్ని నెలలుగా తాగుడుకు బానిసైన ఆదిశేషు తరచూ భార్యతో గొడవపడేవాడు. ఎంతమందలించినా అతని ప్రవర్తనలో మార్పురాకపోవడంతో భర్తను వదిలి పిల్లలతో ఆమె పుట్టింటికి వెళ్లి పోయింది. ఆరు నెలలుగా ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

అడుగడుగునా నీరాజనం

- ఐదో రోజుకు చేరిన ప్రజా సంక్షేమయాత్ర
- ఎమ్మెల్యే పెద్దారెడ్డికి హారతులు పట్టిన మహిళలు





భీమునిపల్లిలో అశేష జనం మధ్య ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అభివాదం, బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరు మండలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. మంగళవారం ఐదో రోజు క్రిష్టిపాడు నుంచి యాత్ర ప్రారంభమైంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర నిర్వహించగా ప్రతి వీధిలోనూ పూలు చల్లుతూ గ్రామ ప్రజలు స్వాగతించారు. కొండుపల్లిలో గ్రామ మహిళలు ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం భీమునిపల్లి యాత్ర బయలు దేరగా ఎమ్మెల్యే రహదారికి ఇరువైపులా ఉన్న పంట పొలాలను పరిశీలిస్తూ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భీమునిపల్లికి చేరుకోగా గ్రామస్తులు అడుగడుగునా పూలతో స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత యాత్ర రావులుడికికి చేరుకుంది. అక్కడి గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున యాత్రకు స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. గ్రామంలో బహిరంగ సభను నిర్వహించారు. అనంతరం చెన్నమ్మతల్లి దేవాలయం వద్దకు చేరుకోవడంతో ఐదవ రోజు యాత్ర ముగిసింది. ప్రతి గ్రామంలో ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరి ప్రజలు ఆనందంగా ఉండటానికే ఈ యాత్ర చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, భీమునిపల్లి రామచంద్రారెడ్డి, రామాంజులరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, రామాంజినేయులు, రంగేశ్వరరెడ్డి, మద్దిలేటి, లక్ష్మీరంగారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబం జోలికి వస్తే తీవ్ర పరిణామాలు

పెద్దవడుగూరు : తప్పుడు కూతలు కూస్తు తన కుటుంబంపై తప్పుడు కేసులు పెడితే జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్ర పరిణామాలు చవి చూడాల్సి వస్తుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హెచ్చరించారు. మంగళవారం రావులుడికిలో ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇంత వరకూ ఎలాంటి పనులు చేయలేదని జేసీ ప్రభాకర్‌రెడ్డి కరపత్రాలు వేయించడం దారుణమన్నారు. తాగుబోతు టీడీపీ కార్యకర్తపై ఎవరో దాడి చేస్తే ఆ కేసు లో తన కుటుంబాన్ని ఇరికించాలని చూడటం నీచమన్నారు. తప్పులు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడం, బెదిరించడం జేసీకి ఆనవాయితీగా మారిందన్నారు. వంకర బుద్ధులు, చెడ్డ అలవాట్లు మానుకోవాలని సూచించారు. 30 ఏళ్లలో జేసీ సోదరులు ప్రజలుధికారులను మోసం చేయకుండా నిజాయితీగా ఎలాంటి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నాగాలాండ్‌లో స్క్రాబ్ కింద కొనుగోలు చేసిన బస్సులు, లారీ లను అధికారులను బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకొన్న ఘనత వారిదేనన్నారు. సొంత పార్టీ కార్యకర్తలైనా మంచి దుస్తులు వేసుకుంటే ఓర్వలేని మనస్తత్వం వారిదని గుర్తు చేశారు. నవరత్నాల పథకాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని, కేవలం ఉనికి కోసమే టీడీపీ నాయకులు ప్రభుత్వం బురద జల్లుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, యాడికి మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, నాయకులు రంగస్వామి, రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, మాజీ ఎంపీపీ రఘునాథరెడ్డి, నగరూరు బ్రహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, వెంకటస్వామిగౌడ్, శేషారెడ్డి, నాగరాజు, నాగభూషణ, మల్లేశ్వరెడ్డి, లక్ష్మంపల్లి ఎంపీటీసీ బ్రహ్మానందరెడ్డి,, ముప్పాలగుత్తి ఆది, ప్రతాప్‌రెడ్డి, బుర్నాకుంట నాగరాజు, రావులుడికి సర్పంచ్ రంగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీరంగారెడ్డి, చిట్టూరు నాగభూషణ, రామాంజినేయులు, ఎర్రిస్వామి, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాఘవరెడ్డి

నార్పల: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రఘవరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేరాలు, డ్రగ్స్‌వంటి ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం,ఆరోగ్యం చేకురుతాయన్నారు. చట్టానికి విరుద్ధంగా ఉండే వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సీజీఎంకు సన్మానం

గుంతకల్లు రూరల్: నక్కనదొడ్డి గ్రామ సమీపంలో ఐఓసీ ఏర్పాటుకు సహకరించిన రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుధీర్‌కుమార్‌ను మంగళవారం లైజెనింగ్ ఆఫీసర్ నజీర్ ఘనంగా సత్కరించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలంగాణ, ఆంధ్ర హెడ్ ఆఫీస్‌లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సుధీర్‌కుమార్ నూతన ఐఓసీ ఏర్పాటు, పురోగతిలో కీలకపాత్ర పోషించారు. ఈ క్రమంలో మంగళవారం ఐఓసీకి విచ్చేసిన ఆయనను ఐఓసీ లైజెనింగ్ ఆఫీసర్ నజీర్ శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించారు.

వాహనాల వేలం



యాడికి పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను వేలం వేస్తున్న అధికారులు

యాడికి: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం గుత్తి ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, పామిడి రూరల్ సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో వేలం వేశారు. ఈ సందర్భంగా 18 బైక్‌లు, రెండు ఆటోలు వేలం వేయగా రూ.5,07,990 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలు, ఒక మహేంద్ర బొలెరో వాహనాలను సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం వేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.2,72,580 ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, ఏఎస్‌ఐ సంపత్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



మహిళతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న కాల్వ గడ్డ వీధి, శాస్త్రి నగర్ వీధుల్లో మంగళవారం సాయంత్రం జన చైతన్య యాత్ర కార్యక్రమం జరిగింది. హర్ష ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు సెక్రటరీలను సూచించాచారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం హర్ష మాట్లాడుతూ సీఎం జగనన్న చేపట్టిన నవరత్నాల పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం జగనన్న పాలనను పలు రాష్ట్రంలో ఆదర్శంగా తీసుకుని అమలుకు ముందుకు వస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. ఆయన వెంట వార్డు నాయకుడు వేణు, కౌన్సిలర్లు ఆకుల చిన్ననాగిరెడ్డి, రాఘవేంద్ర, నాయకులు వాసుదేవరెడ్డి (వాసు),కేశవరెడ్డి, నాగరంగయ్య, లక్ష్మీనారాయణ, వేలూరు శ్రీనివాసులు, గణేష్, సునీల్, బషీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అధిక దిగుబడులపై అవగాహన కల్పిద్దాం



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కమిషనరేట్ ఏడీ శివారెడ్డి, డీఏఓ చంద్రానాయక్

బుక్కరాయసముద్రం: రైతులకు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడుల సాధనపై అవగాహన కల్పిద్దామని కమిషనరేట్ ఏడీ శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పసులూరు కొత్తపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలంబడులను ఆయన తనిఖీ చేశారు. మండలంలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు పంటల సాగుపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే మార్గాలను రైతులకు వివరించాలన్నారు. ఆరోగ్యకరమైన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. మిత్ర పురుగుల ఉత్పత్తిని పెంచుకుని శత్రు పురుగుల నివారించే మార్గాలపై చైతన్యం కల్పించాలన్నారు. రసాయన మందులు వాడకం తగించి సేంద్రియ ఎరువులను వాడేలా చేయాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగులో చీడ పీడలు, వాటి నివారణ మార్గాలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఆత్మాపీడీ మద్దిలేటి, ఏడీఏ వెంకటరాముడు, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్ నాయక్, శంకర్‌లాల్, రైతు శిక్షణ కేంద్రం ఏడీ శైలజకుమారి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రుహానా బేగం, సర్పంచ్‌లు కల్పన, రమేష్, ఎంపీటీసీ శివారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపును అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: గత ప్రభుత్వంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పట్టణ వాసులకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించి నిరంతరాయంగా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని టీడీపీ కౌన్సిలర్లు ఆర్‌డబ్ల్యూఎస్‌కు చెల్లించే నీటి పన్నుల చెల్లింపును అడ్డుకోవడం తగని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైస్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్ రాబర్టు పన్నుల చెల్లింపు చేసిన వ్యాఖ్యలకు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. అనంతరం కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం నిర్వహణపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఇటీవల పైప్‌లైన్, నీటి సరఫరాపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. తాగునీరు, పారిశుధ్య, అండర్ డ్రైనేజీ వ్యవస్థలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ జబ్బార్‌మియా తెలియజేశారు. డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ తేజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో పాటు పలువురు అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో పాటు కౌన్సిలర్లు విద్యారాణి, మహాలక్ష్మి, పవన్‌గౌడ్‌లు మాట్లాడుతూ రెగ్యులర్, కాంట్రాక్ట్ పీహెచ్ వర్కర్లతో పాటు తాత్కాలిక పద్ధతిన నియమించిన 40 మంది పీహెచ్ వర్కర్లను ఏయే వార్డులకు కేటాయించారని ప్రశ్నించారు. వార్డుల్లో అభివృద్ధి పనులు మొదలుపెట్టించాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ శేషన్న స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహించి శానిటేషన్‌ను మెరుగుపరుస్తామని తెలియజేశారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లను విద్యాశాఖలోకి కలపడం వల్ల కొన్నేళ్లుగా మున్సిపల్ స్కూళ్లల్లో ఆయాలుగా పనిచేస్తున్న 26 మంది తొలగిస్తారనే ఆందోళనలో ఉన్నారని, వారికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కమిషనర్ శేషన్న బదులిస్తూ కొన్ని మున్సిపాల్టీల్లో ఆయాల వేతనాలు నిలిపివేశారని, అయినా మన మున్సిపాల్టీలో మాత్రం వారికి జనరల్ ఫండ్ ద్వారా రెండు నెలలుగా వేతనాలిచ్చామని చెప్పారు. కౌన్సిలర్ చాంద్‌బాషా మాట్లాడుతూ ధర్మవరం గేట్ రోడ్డు విస్తరణ పనులను కేఎల్.రావు కూల్‌డ్రింక్ షాపు నుంచి మొదలు పెట్టాలని, ఆర్‌అండ్‌బీ సర్కిల్ ప్రస్తుతం వేస్తున్న డ్రైనేజీని సచివాలయం వరకు వేయించాలని కోరారు. కృపాకర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణల పేరిట ప్రజలను అసౌకర్యాలకు గురిచేయొద్దన్నారు. రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ అప్రూవల్‌తో పాటు ప్రజల ఆమోదంతో పనులు ప్రారంభించాలన్నారు. కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌ను ప్రక్షాళన చేసి రేకులషెడ్‌లను వీధివ్యాపారస్థులకు ఇప్పించాలని సూచించారు. బెయర్షబా చర్చి వద్ద రోడ్డు ప్యాచ్‌వర్కులు పూర్తి చేయించాలని కోరారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన అత్యవసర పనుల నిర్వహణకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు రూ.5.5 కోట్ల నిధులివ్వండి సీడీఎంఏను కోరుతూ కౌన్సిల్ తీర్మానం

ప్రజాప్రయోజనాల దృష్ట్యా పట్టణంలోని ధర్మవరం గేట్, మెయిన్‌రోడ్ల విస్తరణ, తప్పనిసరి భూసేకరణలో భాగంగా ప్రైవేట్ బిల్డింగ్ యజమానులకు పరిహారం చెల్లించేడానికి గానూ ప్రత్యేక గ్రాంటు ద్వారా రూ.5.5 కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ శాఖ సంచాలకులను కోరేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు చైర్‌పర్సన్, కమిషనర్ తెలియజేశారు.

ఎస్‌ఆర్‌ఐటీలో అక్రిడిటేషన్ ప్రాసెస్‌పై వర్క్‌షాపు



ప్రొఫెసర్ మాయాగిరి గొన్సాయ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఆధ్వర్యంలో నాక్ అసెస్‌మెంట్ ఫర్ అక్రిడిటేషన్ ప్రాసెస్‌పై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. గుజరాత్ రాజ్‌కోట్ సౌరాష్ట్ర విశ్వ విద్యాలయం సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అతులగిరి మాయగిరి గొన్సాయ్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ ఎస్‌ఎస్‌ఆర్ డేటా వాలిడేషన్, వెరిఫికేషన్(డీవీవీ) స్టూడెంట్ (ఎస్‌ఎస్‌ఎస్) పీర్ టీం డేటా వ్యాలిడేషన్, వెరిఫికేషన్‌పై చర్చించారు. అన్ని ప్రమాణాల కోసం విశ్వ విద్యాలయాల్లో క్వాంటిటేటివ్ ప్రాసెస్‌పై తెలియజేశారు. గుణాత్మక కొలమానాలు, గ్రీక్ క్యాంపస్ కార్యక్రమాలు, న్యాక్ అక్రిడిటేషన్ కోసం అసెస్‌మెంట్ విధానం, మూల్యాంకన పక్రియపై వివరించారు. న్యాక్ మూల్యాంకన పక్రియపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి చైతన్య కిశోర్, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు రంగనాథుడి సింహ వాహనోత్సవం వైభవంగా సాగింది. రాత్రి 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సహిత రంగనాథుడి ఉత్సవ విగ్రహాలను రంగు, రంగు పూలతో అలంకరించి సింహ వాహనంపై ఉంచి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఈఓ దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



సమస్యపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఉదయం 11.30 గంటలకు సమావేశాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్లు ఫరూక్, కేవీ రమణ, వరదా, వాల్మీకి శివ, నరేష్, వెంకట సుబ్బయ్య, కృపా సుజాత, మర్తాడు హసీనా, పుష్పావతి తదితరులు మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని అధికారులను నిలదీశారు. గుత్తి ఆర్‌ఎస్‌లో ఆక్రమణలపై వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి ధ్వజమెత్తారు. ఆక్రమణల తొలగింపును పద్ధతి ప్రకారం చేపట్టాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్యలతో పాటు ఇతర చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. మేనేజర్ ఇమామ్, మున్సిపల్ అధికారులు వెంకట రెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక



మమత

గుత్తి: పట్టణంలోని మోడల్ కాలేజీ(ఆదర్శ పాఠశాల)లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మమత జాతీయ స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో మమత అత్యంత ప్రతిభ కనబరిచింది. దీంతో నిర్వాహకులు మమతను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఉషా, ఉపాధ్యాయులు అభినందించారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన

యల్లనూరు: తిరుమలాపురంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో కుష్టు నిర్మూలనపై సీహెచ్‌ఓ మధుకుమార్ అవగాహన కల్పించారు. కుష్టు నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ దేశాన్ని కుష్టు రహితంగా చేయడానికి మనందరి కృషి ఎంతో అవసరమన్నారు. రాగి రంగు మచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిరుపాలయ్య, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ కళాశాలలో చేరండి

తాడిపత్రి టౌన్: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచుకునేందుకు అధ్యాపకులు మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు పట్టణ, రూరల్ పరిధిలోని మున్సిపల్, జిల్లా పరిషత్ , ఉన్నత పాఠశాలలకు వెళ్లి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కళాశాలలో విద్యాబోధన, సౌకర్యాలపై అవగాహనక కల్పించారు.

అవధూత నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

యల్లనూరు: పెద్దమల్లేపల్లి –నిట్టూరు గ్రామాల నడుమ వెలసిన అవధూత నారాయణస్వామి ఆరాధనోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి అవధూత నారాయణస్వామికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

గుంతకల్లు: జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.1.8 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సామగ్రి, కూలీలు ఇతరత్రా అన్ని ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోవడం లేదని ఆరోపించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీ.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు బి.మహేష్, ఎస్ ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

గుంతకల్లు రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమస్యలపై ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీన కర్నూలులో నిర్వహించనున్న 3వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆర్డీవో రవీంద్ర కోరారు. మంగళవారం ఆయన ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, ఉపాధ్యక్షుడు సాయినాథ్, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు, తహసీల్దార్ రాము లతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు మహాసభ కరపత్రాలను విడుదల చేశారు.

ఆవుకు సీమంతం

పామిడి: భోగేశ్వరాలయంలో మంగళవారం ఆవుకు భక్తులు సీమంతం నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా భక్తుల పూజ కోసం ఈశ్వరాచారి తన ఆవును ఆలయానికి తెచ్చేవాడు. ఈక్రమంలో భక్తుల కోరిక మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రా, అనిల్ గోమాతాకు సీమంతం చేపట్టారు.